


# పరదేశీ కథలు

– చిట్టే సిద్ధ లలిత



- 96-

## ఎద నిండిన ఎడారి బంధం

**డిసెంబర్ నెల..** ఎడారి చలి పులిలా కువైట్ పట్టణాన్ని వణికించేస్తోంది. సమయం ఉదయం ఐదున్నర గంటలు. ఊరు మంచు దుప్పటిని నిండా కప్పుకుని హాయిగా నిద్రిస్తోంది. మారియెట్ హోటల్ నుండి బయలుదేరిన మా ఆడి కారు నూటా ఇరవై స్పీడుతో ఎయిర్పోర్టు రోడ్ లో సర్రున దూసుకుపోతోంది.

పది నిముషాల్లో లండన్ నుండి వచ్చే బ్రిటిష్ ఎయిర్ వేస్ ఫ్లయిట్ కువైట్ లో లాండ్ అవబోతోంది. పైలట్, కోపైలట్ తో సహా పన్నెండుమంది క్రూను రిసీవ్ చేసుకుని మా హోటల్ కు తీసుకురావాలి.

వారి కోసం నా చేతిలో ప్యాడ్, పెన్నులు, రూము కీ లు రెడీగా వున్నాయి. ఫ్లయిట్ దిగే క్రూ ఈ రోజంతా మా హోటల్ లో రెస్ట్ తీసుకుని రేపుదయం వెళ్ళిపోతారు. నిన్న వచ్చిన క్రూ ఈరోజు కువైట్ నుండి లండన్ తిరిగి వెళ్ళే ఫ్లయిట్ లో సర్వీస్ చేస్తారు.

పట్టణానికి దూరంగా వున్న ఈ ఎయిర్పోర్టు ఏరియాలో చలి ఇంకాస్త ఎక్కువగానే వుంటుంది. అక్కడ తెరలు తెరలుగా ఉవ్వెత్తున వీచే చల్లటి గాలి మనిషిని విసిరి కొడుతుంది. చేతులు వణికి పోతాయి. పెదాలు వంకర్లు పోతాయి. మాట తడబడుతుంది. కళ్ళు ఎర్రబడిపోతాయి. భరించలేని చలితో వళ్ళు ముడుచుకుపోతుంది. ఒహోహో ఒహోహో అంటూ పళ్ళు టకటకా కొట్టుకుంటాయి..

గుండెల్లోంచి చల్లదనం లావాలా పొంగి శరీరాన్ని కమ్మేస్తుంది. మెత్తని రగ్గులో దూరి వెచ్చగా నిద్రపోవాలని మనసు మారాం చేస్తూ వుంటుంది. సహనానికి పరీక్ష, ఇదేంటో శిక్ష అనుకుని వగచే పరిస్థితి. అలాంటి వణికించే చలిలో సైతం తప్పని డ్యూటీలు.

ఆ రోజు యథావిధిగా బ్రిటిష్ ఎయిర్వేస్ లాండ్ అయింది. ఫ్లయిట్ సిబ్బందికి ఇమ్మిగ్రేషన్, చెకింగ్ వుండదు

కాబట్టి పక్కనున్న వి.ఐ.పి లకు కేటాయించిన దారిలో తొందరగా బయటికి వచ్చేస్తారు.
అందుకే చేతిలో వున్న ప్యాడ్ ను రెండు చేతులతో గుండెలకు హత్తుకుని పంటి బిగువున చలి కాచుకుంటూ ఆ గేటుకు ఎదురుగా నిలబడ్డాను. టక టక మంటూ చేసే షూ శబ్దాలతో ఠీవిగా నడుస్తూ చిరునవ్వులు రువ్వుతూ రానే వచ్చారు బ్రిటిష్ ఎయిర్ వేస్ క్రూ. గు..డ్.. మా...ర్నిం..గ్...గ్.. ఓ..ఓఓ....
చలికి నోట్లోంచి వెలువడే శబ్దం చిత్రంగా వినబడుతోంది. వంట్లోంచి ఉవ్వెత్తున ఎగసిపడే చలి శరీరాన్ని వణికిస్తుంటే ఏం మాట్లాడాలో అర్థం కావడం లేదు. నా పరిస్థితి అర్థమయినట్లు చిరునవ్వుతో 'హాయ్ లలితా హౌ ఆర్యూ' అంటూ పలకరించారు.
అందరూ దాదాపూ వారానికి ఒకసారి రెగ్యులర్ గా వచ్చి పోయేవారే.. బాగా తెలిసినవారే.
వారిలో మిస్ లీనా మాత్రం ఒక అడుగు ముందుకేసి ఆప్యాయంగా నా చేతిని అందుకుంది.
"చలిగా వుంది కదూ" మెరిసే కళ్ళతో ఆప్యాయంగా ప్రశ్నించింది.
"ఇట్స్ ఓకే.. డ్యూటీ కదా" అంటూ నవ్వేసాను.
మిస్ లీనా నయాగరా జలపాతమే. గలగలా మాట్లాడుతుంది. దాదాపూ ఐదున్నర అడుగుల పొడవుతో ఆకట్టుకునే అందం ఆమెది. ఆమెను చూసిన వెంటనే అబ్బ ఎంత బావుందో.. ఎయిర్ హోస్టెస్ అంటే ఇలా వుండాలి అని అనుకుంటాం. ఆమె పక్కన నేను పిల్లి కూనలా నడుస్తున్నాను.
మినీ బస్ లో అందరూ కూర్చున్నాక నేను నిలబడి హోటల్ గురించి బ్రీఫ్ గా వివరించి అందరి వద్ద సంతకాలు తీసుకుని వారికి కేటాయించిన రూము కీ లు వారికి ఇచ్చేసి ఒక సీటులో ముడుచుకు కూర్చున్నాను.
మిస్ లీనా చలికి వణికిపోతున్న నన్ను చూసి చిన్నగా నవ్వి "చలి కోటు వేసుకోవాల్సింది" అంది.
"యూనిఫాం పైన వేసుకోనివ్వరు కదా మిస్" అన్నాను.
"అయితే వంటికి వెచ్చగా వుండేలా జాకెట్ లోపల వేసుకోవాలి" అంది. ఏం చెప్పాలో తెలియక తల నిలువునా ఊగించాను.

"ఒకసారి నా రూం కి రా లలితా" అని చెప్పి లిఫ్ట్ లో పైకి వెళ్ళిపోయింది మిస్ లీనా.
నేను క్రూ లిస్ట్ లోని పేర్లను, వివరాలను సిస్టంలో అప్డేట్ చేసి నా టేబుల్ మీదున్న ఫ్లవర్ వేజ్ లోని ఒక గులాబీని తుంచి చేత పట్టుకుని నాలుగో ఫ్లోర్ లో వున్న లీనా రూం తలుపు దగ్గర చేరి చిన్నగా చూపుడు వేలును మడిచి టకటకమని కొట్టాను.
"కమిన్ లలితా" అంది మిస్ లీనా.

మెల్లగా లోనికి అడుగు పెట్టి గులాబీని చేతికి అందించాను.అప్పుడే స్నానం చేసిందేమో కడిగిన ముత్యంలా వుంది మిస్ లీనా.

రాత్రంతా ఫ్లయిట్ లో సర్వీస్ చేసిన బడలిక ఆమెను వదిలి ఫ్రెష్ గా కనబడుతోంది.

"ఎలా వున్నారు మేడం. దాదాపు రెండు నెలలయింది మిమ్మల్ని చూసి. సెలవు తీసుకున్నారా" అని అడిగాను.

"అవును. కొన్ని ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి. వాటి గురించి హాస్పిటల్ చుట్టూ తిరుగుతున్నాను" అంది బాధగా.

"అయ్యో ఏమయింది మిస్.." అన్నాను ఆదుర్దాగా..

"ఏం లేదులే చిన్న ఆపరేషన్ అవసరం అవుతుంది. దానికోసం నేను శారీరకంగా, మానసికంగా సిద్ధపడాలి. ఇదే నా ఆఖరి ట్రిప్ కావచ్చు. లేదా కొంచెం గాప్ తీసుకుని మరలా రావచ్చు. ఒక ఆరు నెలలు మాత్రం నా శరీరానికి రెస్ట్ అవసరం అంది" మిస్ లీనా.

"అయ్యో.. మీకేమీ కాదు. ధైర్యంగా వుండండి అన్నాను" సమస్య తెలియదు కాబట్టి.

"సరే.. ఏం చెయ్యగలం జీవితమన్నాక ఒక్కోసారి పోరాటం తప్పదు. కానీ నేను ఓడిపోకూడదు. గెలవాలి. గెలిచి తీరాలి. నేను చెయ్యాల్సిన పనులు చాలా వున్నాయి" అంది.

"వర్రీ అవకండి మీరు తప్పకుండా గెలుస్తారు" అన్నాను.

"ఇదిగో నీ కోసం చిన్న గిఫ్ట్" అంటూ చానెల్ సెంటు బాటిల్ ను నా చేతిలో పెట్టింది.

"ఓ థాంక్యూ మిస్" అన్నాను.

"ఆపై వారంలో ఇంకో ట్రిప్ నేను రావాలి. అప్పుడు నీకు మరొక గిఫ్ట్ తెస్తాను. అది నీకు బాగా ఉపయోగపడుతుంది" అంటూ నవ్వింది.

ఆ నవ్వులో ఏదో దిగులు.

తరువాత ఆమెను బ్రేక్ ఫాస్ట్ కోసం రెస్టారెంట్ లో వదిలి నేను నా ఆఫీసు లోకి వెళ్ళిపోయాను.

మరుసటి రోజు నిన్నటి బ్రిటిష్ ఎయిర్ వేస్ క్రూ నాకు వీడ్కోలు చెప్పి బస్ ఎక్కారు.

మిస్ లీనా కూడా నన్ను ఆప్యాయంగా హత్తుకుని బై చెప్పింది.

నేను కాస్త పరిశీలనగా ఆమె కళ్ళలోకి చూసి వుంటే బావుండేదేమో.

ఆ సమయంలో ఆమె కళ్ళు తడి అయ్యాయి అని ఆ తరువాత నాకు అనిపించింది.

నేను కూడా ఎయిర్ పోర్టుకు వెళ్ళడానికి డ్రైవర్ తో కారెక్కాను.

మధ్య దారిలో వాళ్ళున్న బస్ డిపార్చర్స్ వైపు, నేనున్న కారు అరైవల్స్ వైపు దారులు మారి గమ్యం వైపు సాగిపోయాయి.

వాళ్ళను వదిలిన బస్ మరలా ఫ్లైట్ దిగి వచ్చే క్రూ కోసం అరైవల్ గేటు వద్దకు వచ్చేస్తుంది. అది నిత్య కృత్యం.

క్రూ అందరూ కూడా ఎంతో ఆప్యాయంగా పలకరించి స్నేహంగా మెలుగుతారు.

మర్యాద మన్నన, మంచిమాట తెలియజేయడంలో, హుందాగా, పద్ధతిగా ప్రవర్తించడంలో యూరోపియన్స్ ముందుంటారు అనేది నేను గమనించాను.

తరువాత నాల్రోజులకు కువైట్ ఎయిర్ పోర్ట్ లో ఫ్లైట్ దిగిన క్రూ లోని మిస్ జెన్నిఫర్ నాకొక పాకెట్ చేతికి ఇచ్చింది.

"ఏంటి మిస్" అని అడిగాను.

"సర్ ప్రైజ్. ఇంటికెళ్ళి చూడు" అంది నవ్వుతూ.

డ్యూటీ అయ్యాక పాకెట్ తెరిచి చూసాను.

లోపల మెత్తగా ముట్టుకుంటే మాసిపోయేలా వున్న అందమైన స్వెట్టర్ వుంది. దాంతో పాటూ మడతల్లో ఒక ఉత్తరం కూడా వుంది.

తెరిచి చూసాను.

మిస్ లీనా వ్రాసిన ఉత్తరమది.

అందమైన దస్తూరీతో ఇంగ్లీష్ లో రాసిన ఆ అక్షరాల వైపు నా కళ్ళు పరుగులు తీసాయి.

"లలితా..

ఈ స్వెటర్ తో నీకు చలి తగ్గుతుంది.

స్నేహం ఎప్పుడూ ఎండల్లో చేతి రుమాలులా.. శీతాకాలంలో రగ్గులా వుండాలి. అందుకే ఈ చిన్న బహుమతి.

ఈ మధ్య ఆరోగ్యం బాలేక ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాను. స్వెటర్ అల్లికలో మా అమ్మ ఆరితేరినది. ఆమె నుండి మేమూ నేర్చుకున్నాము. ఇంట్లో ఖాళీగా కూర్చుని వున్నానుగా.. ఈ సమయంలో నీకోసం ఈ స్వెటర్ అల్లేసాను. నేను స్వయంగా ఊలుతో అల్లిన ఈ కోటు నీకు నచ్చుతుందనే భావిస్తున్నాను. ఏ జన్మలో బంధమో కానీ నిన్ను  చూస్తుంటే ఎప్పుడో వేల ఏళ్ళ క్రితం పరిచయమయిన స్నేహంలా అనిపిస్తున్నావు.

ఎయిర్ హోస్టెస్ వృత్తి నాకు చాలా ఇష్టమైనది. రావాలనే వుంది. కానీ రాలేని పరిస్థితి. శరీరం అవస్తతో శిధిలావస్థలో వుంది.

కోలుకుంటుందో లేదో వేచి చూడాలి. కొద్ది నెలలు అన్నిటికీ దూరంగా వుండి శరీరంలోని శత్రువుతో పోరాడాలి. గెలవాలి. నీ ప్రార్థనలు నాతో వుంటాయని నాకు తెలుసు. తొందరలో తప్పకుండా కోలుకుంటాను. కువైట్ వచ్చి నిన్ను చూస్తాను. నువు జాగ్రత్త.

**ఇక వుంటాను..**

**నీ ఫ్రెండ్ లీనా."**

ఆ తరువాత చాలా రోజులు మిస్ లీనా కోసం ఎదురు చూసాను. ఆమె రాలేదు. రోజూ కువైట్ వచ్చి వెళ్ళే క్రూను కూడా అడిగాను. అందరూ కూడా.. "లీనా ఆరోగ్యం బాలేదు. కోలుకున్నాక తిరిగి వస్తుంది" అని జవాబు చెప్తున్నారు.

ఎందుకో లీనాను చూడాలని నా హృదయం తహతహ లాడింది. చలికాలం సాగిపోయింది. ఎండలు మొదలయ్యాయి. స్వెటర్ ను మడిచి జాగ్రత్తగా బీరువాలో దాచాను. ఆ స్వెటర్ మిస్ లీనా మాటలా మృదువుగా, చేతి స్పర్శలా మెత్తగా, ప్రేమ నిండిన ఆమె హృదయంలా అందంగా అనిపించింది.

ఎండాకాలం వీడ్కోలు పలికే సమయంలో ఒకరోజు మిస్ జెన్నిఫర్ లండన్ నుండి ఫ్లైట్ దిగింది. ఆమె లీనాకు మంచి ఫ్రెండ్. మిస్ లీనాను చూసినట్లే భావించి సంతోషించాను.

జెన్నిఫర్ మిస్ లీనాకు బాల్య మిత్రురాలని ఒకే స్కూల్ లో కలిసి చదువుకున్నారని ఒకే ఊరిలో నివసిస్తున్నారని తెలుసు.

ఈమె మాత్రమే లీనా గురించి నాకు కరక్ట్ గా చెప్పగలదు అనుకుంటూ.. గబగబా నడుచుకుంటూ ఎదురెళ్ళి స్వాగతం పలుకుతూ మిస్ లీనా ఎలా వుందని అడిగాను. జవాబు చెప్పకుండా "నువ్వెలా వున్నావు" అని అడిగింది.

నేను లీనా గురించి అడిగినప్పుడల్లా ఆమె మాటను మార్చేస్తోంది. ఎందుకో నాకర్థం కాలేదు.

ఈమధ్య ఇద్దరి మధ్యా మనస్పర్థలు కలిగాయేమో అందుకే లీనా గురించి మాట్లాడేందుకు ఇష్టపడలేదు అనుకున్నాను.

మరెలా..

మిస్ లీనా గురించి ఎలా తెలుస్తుంది.. ఎవరిని అడగాలి..? ఆమె ఎలా వుందో ఎవరు చెబుతారు. ఆలోచనలో పడ్డాను. ఆ సాయంత్రం మిస్ జెన్నిఫర్ లాబీలో కనబడింది. దగ్గరికెళ్ళి పలకరించి మరలా మిస్ లీనా గురించి ఓపికగా అడిగాను.

"అబ్బా లలితా ఎందుకు పదే పదే లీనాను అడిగి విసిగిస్తావ్. దానికేం బాగానే వుంటుందిలే. చీమకు కూడా హాని చెయ్యని మనస్తత్వం లీనాది. అందరినీ ప్రేమిస్తూ, పలకరిస్తూ, మంచి చేస్తూ బతికిన మానవతామూర్తి ఆమె. స్వర్గమే ఆమెకు తగిన నివాసం." అంది నవ్వుతూ.

ఆ నవ్వు ముఖంలో కొండంత దిగులు కొట్టొచ్చినట్లు కనపడింది. నా మనసు ఏదో కీడు శంకించింది. జెన్నిఫర్ మా గెస్ట్. ఆమెను విషయం ఏంటి అని రెట్టించి అడగలేను.

మిస్ లీనా గురించి ఏ సమాచారం తెలియకపోవడంతో నిరాశ ఆవరించింది నన్ను.

ఇంతలో ఎవరో వచ్చి ఏదో అడగడంతో అటువైపు వెళ్ళి పనిలో పడిపోయాను.

ఆ రాత్రంతా కలత నిద్రతో కాలం గడిపాను. మిస్ లీనాకు ఏమయ్యింది అనే ఆందోళనతో నిద్ర పట్టలేదు. అందమైన ఆమె ముఖమే కళ్ళముందు మెదిలింది. నేను ఫైవ్ స్టార్ హోటల్లో జాబ్ చేస్తున్నాను కాబట్టి రోజూ ప్రపంచ దేశాల నుండి వచ్చే ఎంతో మంది గెస్ట్ లను సాదరంగా రిసీవ్ చేసుకుంటూ వుంటాము.

వారితో మోతాదు మించని మాటలు, అప్పుడప్పుడూ కబుర్లు, స్నేహపూర్వకమైన సంభాషణలతో పరిమితి కలిగిన పరిచయాలు సహజంగానే ఏర్పడతాయి.

కానీ మిస్ లీనా అందరిలోనూ ప్రత్యేకమైనది.  నేనంటే ఆమెకు ఎంతో ఇష్టం.మా మాటల్లో ప్రవహించే ఆత్మీయత అమూల్యమైనది. అలమారా తెరిచి ఆమె పంపిన స్వెటర్ ని చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా తడిమాను. తెలియని ఆవేదనతో కళ్ళలోని నీటి చుక్కలు బుగ్గలపైకి రాలాయి. మనుషులతో ఏర్పడే బంధాలన్నీ బాధకు, దు:ఖానికి హేతువులనిపించింది.

ఒక్కసారి మిస్ లీనాను చూడాలి. ఆమెతో మాట్లాడాలి అని ప్రాణం తపించిపోయింది. ఎలా వుందో పాపం. అనారోగ్యంతో ఎంత బాధ పడుతోందో. ఏ అసహాయ స్థితిలో వుందో? దగ్గరగా వుంటే వెళ్ళి చూసేదాన్ని కదా అనిపించి హృదయం బాధతో తల్లడిల్లిపోయింది. ఎందుకో మిస్ జెన్నిఫర్ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యేట్లు చెప్పడం లేదు. మిస్ లీనా ఎలా వుందో చెప్తే బావుండు. పరిపరి విధాల పరితపిస్తోంది మనసు.నేను ఇంత సున్నితంగా వుండకూడదేమో..

సున్నితమైన హృదయం బాధకు నెలవే కదా. కూర్చుని మిస్ లీనా కు పంపిద్దామని ఒక ఉత్తరాన్ని రాసాను. అందులో నా పర్సనల్ ఫోన్ నంబర్ ఇచ్చి ఒకసారి కాల్ చెయ్యమని చెప్పాను. ఎటువంటి పరిస్థితిలో వున్నా కూడా ఈ ఉత్తరాన్ని చూస్తూనే మిస్ లీనా తప్పకుండా నాకు కాల్ చేసి మాట్లాడుతుందని నా నమ్మకం. అన్యమనస్కంగానే తయారయి ఉదయాన్నే డ్యూటీకి వెళ్ళాను.

ఫ్లైట్ ఎక్కాల్సిన క్రూ అంతా బ్యాగులు సర్దుకుని బ్రేక్ ఫాస్ట్ చేస్తూ హోటల్ లాబీలోని రెస్టారెంట్ లో వున్నారు.
వెళ్ళి మిస్ జెన్నిఫర్ కు నేను రాసిన లెటర్ ను ఇచ్చి "దయచేసి ఈ ఉత్తరాన్ని మిస్ లీనాకు అందివ్వండి" అన్నాను అర్థింపుగా.

నవ్వింది మిస్ జెన్నిఫర్. కాసేపు నవ్వుతూనే వుంది. ఆమె కళ్ళ నిండుగా నీళ్ళు ఊరాయి. ఒక్కుదుటున లేచి నిలబడి నన్ను హత్తుకుని నా భుజం తట్టింది.

"లీనాను కలవడానికి నాకు ప్రత్యేకమైన విమానం కావాలి అంది."

"అదేంటి మిస్ మీరు ఒక ఊరిలోనే కదా వుంటారు కార్ లో వెళ్ళి రావచ్చు కదా.." అమాయకంగా ప్రశ్నించాను.

"అవును కానీ కాన్సర్ అనే మహమ్మారి  లీనాను నానుండి కనబడనంత దూరంగా తీసుకెళ్ళిపోయింది.
నా సమయం వచ్చినప్పుడు ఆ దేవుడు నన్ను పిలిస్తే గానీ  లీనా దగ్గరికి నేను వెళ్ళలేను. పైకి వెళ్ళి లీనాను కలిసినప్పుడు తప్పకుండా ఈ ఉత్తరాన్ని ఆమెకు అందిస్తాను. అక్కడ స్వర్గంలోని స్కూల్లో మరలా మేము చదువుకోవాలి. హాయిగా ఆడుకోవాలి. పాడుకోవాలి. అందమైన మా బాల్యాన్ని మరలా మేము తిరిగి పొందాలి.
చేతిని ఆకాశం వైపు చూపిస్తూ అదిగో లీనా అక్కడ మనకోసం అక్కడ ఎదురు చూస్తోంది" అంది ఉత్తరాన్ని మడిచి బ్యాగులో పెట్టుకుంటూ.

నాకు నోట్లోంచి మాటలు రాలేదు. మూగబోయాను. దు:ఖం గుండెలోతుల్లోంచి పెల్లుబికి పైకి ప్రవహిస్తోంది.
అది నిజం కాదు అనే మీమాంసలో నిశ్చేష్టురాలినై లాబీలో నిలబడి వెళ్ళే ఫ్లయిట్ సిబ్బందికి అలాగే వీడ్కోలు పలికాను.

మిస్ లీనా ముఖం కళ్ళముందు మెదిలి మనసు మెలితిరిగింది. దు:ఖం వెల్లువయింది. మనుషుల్లేని ఒక మూలకు వెళ్ళి కూర్చుని గుండె భారం తీరేలా కాసేపు ఏడవాలి అనిపించింది. వెంటనే లాకర్ రూంకు పరిగెత్తుకుని వెళ్ళి చేతుల్లో ముఖం దాచుకుని మనసు తెరిపి పడేంతవరకూ ఏడ్చాను.

ఇప్పటికీ అప్పుడప్పుడూ ఆకాశంలో ఎగిరే విమానాన్ని చూసినప్పుడల్లా మిస్ లీనా ముఖం కళ్ళముందు మెదులుతూనే వుంటుంది. చిరునవ్వుతో నాకేసి చూస్తున్నట్లే వుంటుంది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments